

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బ్లాక్ &వైట్ కథ

**నేను** ఆఫీస్ నించి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో రాధిక ఉంది. తన దగ్గర నా ఇంటి డూప్లికేట్ ఉంటుంది కాబట్టి నేను ఆశ్చర్యపోలేదు.

"ఆఫీస్‌కి వెళ్ళలేదా? మళ్ళీ వికాస్‌తో గొడవా?" హేండ్‌బేగ్‌ని అల్మైరాలో పెడుతూ నెమ్మదిగా అడిగాను.

"వెళ్ళాను. జస్ట్ ఐదు నిమిషాలైంది వచ్చి" చెప్పింది.

ఆమె కళ్ళూ, ముక్కూ ఎర్రగా ఉండటంతో బాగా ఏడ్చిందని అర్థమైంది. చేతులు కడుక్కుని వచ్చి తన పక్కన కూర్చుని అనునయంగా అడిగాను.

"ఏమైంది రాధీ?"

ఉప్పెనలాంటి దుఃఖం రాధికని ముంచెత్తింది. నా ఒళ్ళో తల పెట్టి వెక్కి వెక్కి ఏడవసాగింది. నేనేం మాట్లాడకుండా దాని తల నిమురుతూ ఉండిపోయాను.

నాకు తెలుసు రాధికది దురదృష్టపు జీవితం. చిన్నప్పుడే వాళ్ళమ్మ పోయింది. పడవ మునిగి ఆవిడ మునిగిపోయింది. ఆవిడ ఒళ్ళోని రాధికని ఎవరో పుణ్యాత్ములు రక్షించారు. ముప్ఫై ఆరేళ్ళ వయసులోని తండ్రి కూతుర్ని పట్టించుకోకుండా ఇంకో పెళ్ళి చేసుకున్నాడు. అమ్మమ్మ ఉన్నన్నాళ్ళు ఫర్వాలేదు కాని ఆ తర్వాత రాధిక బతుకు మరీ అధ్వాన్నమైపోయింది. ఇంట్లో గొడ్డు చాకిరీ చేసి స్కూల్‌కి వచ్చేది. కష్టపడి చదివేది. మళ్ళీ ఇంటికి వెళ్ళగానే పని. పన్నెండేళ్ళ రాధిక కట్టెలపొయ్యి మీద అన్నం వండుతుందని తెలిసి మేమంతా ఆశ్చర్యపోయేవాళ్ళం, 'అమ్మో కాలదూ? 'పొగకదూ?' 'తర్వాత గిన్నెని పొయ్యిమీంచి నువ్వేదింపుతావా? ఆవిరికొట్టదూ?' లాంటి ప్రశ్నలు వేసేవాళ్ళం. రాధిక చేతులు మా చేతుల్లా మెత్తగా ఉండేవికావు. గరుకుగా గోళ్ళు చిట్లి ఉండేవి.

"చిన్నపిల్లవి. నీ చేత అంతపని చేయిస్తుంది. మరి మీ అత్త ఏం చేస్తుంది ఇంట్లో?" ఓ రోజు కోపంగా అడిగాను.

"నేను చేసే పనుల్లో తప్పులెంచి మామయ్యతో చెప్పి తిట్టిస్తుంది" రాధిక నవ్వింది.

నాకు ఆవేశం వచ్చి ఇంటికి వెళ్ళాక మా అమ్మతో చెప్పాను.

"అమ్మా రాధిని మనం పెంచుకుందామే. వాళ్ళ అత్తయ్య బ్రహ్మ రాక్షసి. దాన్ని కొట్టి చంపుతోంది."

"అయ్యో" అని సానుభూతి చూపించిన అమ్మ చెప్పింది.

"ఆ అమ్మాయికి హెల్ప్ చెయ్. రేపటినించి రెండు బాక్స్‌లు తీసుకెళ్ళు. గ్రాఫ్ పేపర్, కలర్ పెన్సిల్స్ లాంటివి కొనమంటే, నీతోపాటు రాధికకి కూడా కొనిపెట్టు. బాగా చదువుకుంటే మంచి ఫ్యూచర్ ఉంటుందని చెప్పు."

"మనింట్లో ఉంచుకోవచ్చుగా?" గొణిగాను.

"ప్రాక్టికల్‌గా జరిగేవి మాట్లాడదాం. 'మీరు పిల్లని తిట్టి, కొట్టి వేధిస్తున్నారు, మా ఇంటికి పంపేయండి' అంటే పంపుతారా? అందుకు వాళ్ళ నాన్న పర్మిషన్ కూడా కావాలి. ఆయనెక్కడ ఉన్నాడో మనకి తెలీదుగా. అందుకే చేతనైన సాయం చెయ్యి" అమ్మ అనునయంగా చెప్పింది.

ఆ తర్వాత నేను రాధకకి ఆప్తమిత్రురాలినయ్యాను. ఇద్దరం కలిసి చదువుకునేవాళ్ళం. అమ్మ చెప్పినట్లు తనకి అవసరమైన స్టేషనరీ కొనిచ్చేదాన్ని. తనకి అర్ధంకాని పాఠాలు నాకర్ధమైనట్లుగా చెప్పేదాన్ని.

డిగ్రీ చదివేప్పుడే ఇద్దరం బేంక్ ఎగ్జామ్స్ రాసాం. ఇద్దరం సెలక్ట్ అయ్యాం. అమ్మయ్య రాధిక జీవితం కుదుటపడుతుంది ఇంక అనుకున్నప్పుడు వాళ్ళ నాన్న ఊడిపడ్డాడు. రెండో భార్య బంధువు వికాస్‌తో దాని పెళ్ళి చేసాడు.

వికాస్ కొంచెం కోపిష్టివాడు. 'సరసం తెలీదు' అంటుంది రాధిక. నెలకోసారైనా అతనితో పోట్లాట జరగడం, రాధిక ఇంట్లోంచి వచ్చేసి నా దగ్గర రెండు రోజులుండి మూడోరోజు తనింటికి వెళ్ళిపోవడం ఈ నాలుగేళ్ళుగా జరుగుతోంది.

ఈసారి అంతే అనుకున్నాను. కాని పదిరోజులైనా వెళ్ళలేదు. ఆ ఆదివారం ఇద్దరం కలిసి వంట చేసుకుంటూండగా అడిగాను.

"ఈసారేమిటి వికాస్ మీద ఎక్కువ రోజులు అలిగావు?" ఉల్లిపాయలు కోస్తున్న రాధిక కళ్ళవెంట కారే నీటిని తుడుచుకుంటూ అడిగింది.

"నన్ను పేయింగ్ గెస్ట్‌గా ఉంచుకుంటావా?"

"ఏమైంది? ఎప్పట్లాగే గిల్లికజ్జాలు కాదా?" ఆశ్చర్యంగా అడిగాను.

"కాదు. వికాస్‌కి సరసం తెలీదు. పెళ్ళాంతో ప్రేమగా మాట్లాడడం తెలీదు. బానిసగా చూస్తాడు. ఓ మంచి ప్రశంస కాని, ఓదార్పు కాని అసలు ఏ స్పందన ఉండదని చెప్పాను కదా?"

"లక్షసార్లు చెప్పుంటావు. ఏం చేస్తాం? ఒక్కొక్కళ్ళ స్వభావం అది. వ్యక్తపరచడం రాదు. మా అక్క పది మాటలు మాట్లాడితే, మా బావ ఒక మాట మాట్లాడతాడు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ లవ్ తెలీదు అంటుంది అక్క. వికాస్ కూడా అంతే" ఓదార్చాను.

"లేదు. వికాస్‌కి తెలుసు. సరసం తెలుసు. ప్రేమగా మాట్లాడడం తెలుసు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ లవ్ తెలుసు. అసలు తనెంత రొమేంటిక్ పర్సనో నీకు తెలీదు."

రాధిక పెద్దగా ఏడ్చింది.

నేను తన చేతిని పట్టుకుని హాల్లోకి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టి అడిగాను.

"ఏం జరిగింది?"

"వికాస్‌కి నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదు. మా నాన్న ఆస్తికోసం పిన్ని బలవంతంగా చేయించిందా పెళ్ళి. ఆవిడకో పిల్లన్నా పుడితే నేను హాయిగా నీలా ఉద్యోగం చేసుకుంటూ సింగిల్‌గా బతికేదాన్ని. ఇష్టంలేని పెళ్ళి అవడంతో వికాస్ నాతో అలా నెగెటివ్‌గా బిహేవ్ చేసాడు. అతనిలోని మరో ఏంగిల్‌ని మొన్న చూసాను" రాధిక రెండు నిమిషాలు మౌనంగా ఉండిపోయింది.

"ఏం చూసావు?" నేను అసహనంగా అడిగాను.

"వికాస్ ఓ అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చాడు. కాలేజీలోనే ఆమెని ప్రేమించాడట. ఆమెని వదిలి వుండే ప్రసక్తి లేదన్నాడు. మా నాన్న ఉన్నంతవరకు కొద్దిగా భయపడ్డాడు. ఇప్పుడు నాకెవరూ లేరుగా? సో ముసుగు తీసేసాడు. రెండో బెడ్ రూంలో ఆ అమ్మాయి ఉంటుంది. ఇష్టమైతే నువ్వుండచ్చు లేదా ఫో" అన్నాడు.

"వార్నీ! పోలీస్ రిపోర్ట్ ఇవ్వకపోయావా?" ఆవేశంగా అడిగాను.

"వాళ్ళు పెళ్ళి చేసుకోలేదు. కలిసి ఉంటున్నారంతే. అదిప్పుడు చట్టరీత్యా నేరంకాదుకదా? నాకు అయోమయమైపోయింది. నిర్లిప్తంగా అలాగే రెండురోజులు ఆ ఇంట్లో ఉన్నాను. నేను అనే మనిషి లేనట్లుగా వికాస్ ఆమెతో చెప్పే ముచ్చట్లు, ఆమెకి పెట్టే ముద్దులు, కౌగిలింతలు, ఒకే కంచంలో తినడాలు.. వికాస్ ఇంత ప్రేమని దాచుకున్నాడు మనసుతో.

ఆ అమ్మాయి కూడా నన్నో చీమలానో, పురుగులానో చూస్తూ పట్టించుకోకుండా, నా మొగుడితో గారాలు పోవడం, కలిసి స్నానాలు చేయడం ఇవన్నీ నన్ను రెచ్చగొట్టడానికేమో అనిపించింది. పొమ్మనలేక పొగపెట్టడం అంటారు చూసావా? అలా. ఇంక నావల్ల కాదని వచ్చేసాను. మళ్ళీ వెనక్కి వెళ్ళాలా అని ఆలోచించాను కాని నావల్ల కాదు. నీతో ఉండనిస్తావా?" రాధిక దీనంగా అడిగింది.

నేను దాని చేతులు పట్టుకుని చెప్పాను.

"చిన్నప్పుడు మా అమ్మని అడిగాను. 'రాధికని మనం పెంచుకుందామమ్మా' అని. అదిప్పటికి కుదిరింది. హేపీగా ఉండిపో. వికాస్‌కి విడాకులిస్తే, ఆ అమ్మాయిని లీగల్‌గా పెళ్ళిచేసుకుంటాడు. ఇష్టంలేని మనిషితో బంధం ఎందుకు?"

రాధిక నవ్వి చెప్పింది.

"మా పిన్నిని మర్చిపోతున్నావ్. వికాస్‌కి విడాకులిస్తే నా ఆస్తి వాళ్ళకి రాదుగా? చచ్చినా ఇవ్వడు. కోర్ట్‌కి వెళితే పదేళ్ళు మినిమం పడుతుంది. ఈలోగా ముసలమ్మనైపోయి కృష్ణా రామా అంటూ బతుకుతాను. ఇప్పుడైనా చేసేది అదేగా."

నాకు ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"పోనీ నువ్వు కూడా నీకిష్టమైన వారు దొరికితే లివిన్‌గా ఉండచ్చా?"

"ఎక్కడ దొరుకుతారు? నా అదృష్టం మీద నాకు నమ్మకం పోయింది. ఈ జన్మకీ అనుభవాలు చాలు" రాధిక దండం పెట్టింది.

ఓ రోజు నేను బేంక్ నించి వచ్చేసరికి రాధిక శోక దేవతలా కూర్చుని వుంది.

"మళ్ళీ ఏమైంది? వికాస్‌ని కాంటాక్ట్ చేసావా?" కోపంగా అడిగాను.

"ఛ! లేదు. వికాస్ కీప్ నెల తప్పిందట" చెప్పింది.

ఏం మాటలు రాధీ? కీప్ అనేది ఎంత తప్పు మాట? ఫ్రెండ్ అనరాదూ?" ఇబ్బందిగా చెప్పాను.

"మూడో మనిషిగా నీకు సంస్కారంగా మాట్లాడాలని ఉంటుంది కాని నేను విక్టిమ్‌ని. నాకు దాన్ని తెలుగులో నొక్కి చెప్పాలని ఉంటుంది. నీ కోసం ఇంగ్లీష్‌లో చెప్పా" చెప్పింది.

"సరే థాంక్స్. దానికి నువ్వేడవడం ఎందుకు? విసుగ్గా అడిగాను.

"నాకు పిల్లలంటే చాలా ప్రేమ. కాని వికాస్ ఐదేళ్ళదాకా పిల్లలొద్దు అన్నాడు. ఆర్నెల్లు తిరక్కుండానే అది ప్రెగ్నెంటైంది. అంటే వికాస్ నాతో పిల్లల్ని కనదల్చుకోలేదు" మళ్ళీ కన్నీరు కార్చింది.

"మీ లవ్ - హేట్ రిలేషన్ షిప్ నాకు అర్థంకాదు కాని నువ్వింక వికాస్‌ని మర్చిపోవడం మంచిదని నా సలహా" చెప్పాను.

❦❦❦

వికాస్‌కి కూతురు పుట్టింది. రాధిక చూద్దామని వెళ్తే, ఆ అమ్మాయి గదిలోకి రానివ్వలేదట. వికాస్ కూడా మా బతుకులు మమ్మల్ని బతకనీ. గెట్ లాస్ట్' అన్నాట్ట. రెండు రోజులు ఏడ్చింది. నాకు చిరాకు వచ్చింది.

"ఎందుకట్లా వెంటబడతావు? నువ్వు వద్దన్నవాడిని వదిలేయాలి కాని సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుండా వెంటబడతావే?" తిట్టాను.

"నాకు అర్థమౌతోంది. కానీ మానసికంగా బలహీనురాలినైపోయాను. చిన్నప్పటినించి ఏ ప్రేమకీ నోచుకోలేదు. పరాయి ఇళ్ళల్లో ఉన్నాను. పెళ్ళవగానే నాకంటూ ఒక ఇల్లు, ఒక భర్తా, ఇద్దరు పిల్లలు ఉంటారని ఆశబడ్డాను. అనుకున్నది ఏదీ జరగలేదు" కుమిలి కుమిలి ఏడ్చింది.

"రాధీ నువ్విలా ఆలోచిస్తూంటే డిప్రెషన్‌లోకి వెళ్తావు. పాజిటివ్ ఏంగిల్ ఏంటంటే, వికాస్ మీద ఆధారపడకుండా నీకు జాబ్ ఉంది. నేనున్నా. ఈ ఇల్లుంది. నేను వికాస్‌కి చెప్పి చూస్తాను. పాప పుట్టిందిగా, ఇంక వాళ్ళు పెళ్ళి చేసుకుంటే మంచిది. మ్యూచ్యువల్‌గా విడాకులు తీసుకోండి. ఆ తర్వాత నీ బతుకు నువ్వు ప్రశాంతంగా బతుకు. ఇంక వాళ్ళ జీవితాల్లోకి తొంగి చూడడం మానెయ్" ఓదార్చాను.

❦❦❦

ఆ తర్వాత రాధిక నాముందు దుఃఖాన్ని ప్రదర్శించలేదు. తను ఇంటికి ఏ టైంకి వచ్చినా పట్టించుకోవడం మానేసాను. కానీ ఆ రోజు రాత్రి పదకొండుదాకా రాకపోతే భయమేసింది. ఫోన్ చేసాను.

"అరగంటలో ఉంటాను" చెప్పి ఫోన్ కట్ చేసింది. పన్నెండుకి వచ్చింది. మనిషి అలసటగా, నీరసంగా ఉంది. చేతికి ఐవి ప్లాస్టర్ ఉంది.

"ఏమైంది? ఏదైనా ఏక్సిడెంటైందా?" కంగారుగా అడిగాను.

"ముందు స్నానం చేసి వస్తాను. గివ్ మీ టూ మినిట్స్" బాత్‌రూంలోకి వెళ్ళింది. ఐదు నిమిషాల తర్వాత నైటీ వేసుకుని, జుట్టుని టవల్‌తో తుడుచుకుంటూ బయటకి వచ్చింది.

"నేను అడిగితేకానీ ఏమయ్యావో చెప్పవా? ఫోన్స్ ఉన్నా కమ్యూనికేషన్ లేకుండా ఏంటిది? హాస్టల్ అనుకుంటున్నావా? ఇల్లనుకుంటున్నావా? ఎంత కంగారు పడ్డానో తెలుసా?" అరిచాను.

"ధరణికి ఏక్సిడెంటైంది" నెమ్మదిగా చెప్పింది.

"ధరణెవరు?"

"అదే వికాస్ కీప్."

నేను నిర్ఘాంతపోయాను.

"ఆ అమ్మాయికి ఏక్సిడెంటైతే నీకెందుకు లేటైంది? కొంపదీసి నీ బైక్‌తో గుద్దలేదుకదా?"

"ఛఛ. ఆర్టీసి బస్ కింద పడింది."

"అమ్మో! బతికుందా?"

"కోమాలో ఉంది. చాలా బ్లడ్ పోయింది. మనం బ్లడ్ ఎక్స్చేంజ్‌గా ఇస్తే వాళ్ళు తన గ్రూప్ బ్లడ్ ఎక్కిస్తారట. వెళ్ళి బ్లడ్ ఇచ్చి వచ్చాను. వికాస్ బాగా పేనిక్ అయ్యాడు. దగ్గర ఎవరూ లేరని కాసేపు కూర్చున్నాను" బెరుగ్గా చెప్పింది.

నేను దానివంక కళ్ళు విప్పార్చి చూసాను.

"ఇంకో విషయం కూడా చెప్పాలి. వికాస్ దగ్గర సేవింగ్స్ లేవుట. ఐదు లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసాను."

"నీకేమైనా పిచ్చెక్కిందా? వాడు నిన్ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాడే నీ ఆస్తి కోసం నీకు విడాకులివ్వడు. నిన్ను గాలికి వదిలేసి ఇంకో దానితో పిల్లల్ని కంటాడు. ఇప్పుడు దాని ట్రీట్‌మెంట్ కోసం నీ రక్తం, నీ సంపాదన కూడా పీల్చేస్తున్నాడు. నువ్వెప్పటికి బుద్ధి తెచ్చుకుంటావే పిచ్చిదానా?" ఉద్రేకంగా అరిచాను.

శోకదేవతలా ఉన్న రాధిక రెండు చేతులతో నన్ను చుట్టేసి నా భుజం మీద తలపెట్టి నెమ్మదిగా చెప్పింది.

"వికాస్ గురించి నాకు బాగా తెలుసు. నేను వాడి మాయలో పడలేదు."

"మరి? ఐదు లక్షలు. నువ్వు చీమలాగా కూడబెట్టిన డబ్బంతా తీసుకెళ్ళి వాడి మొహాన పోసావు. నీకు ఏదైనా అయితే వాడు రూపాయి కూడా ఇవ్వడు."

"తెలుసు."

"తెలిసే ఈ పిచ్చి పనెందుకు చేసావు? రక్తదానం ఎందుకు చేసావు? నువ్వేమన్నా కన్నాంబ, శ్రీరంజని అనుకుంటున్నావా? ఏమిటీ అర్థంలేని త్యాగాలు? నువ్వు ఫూల్‌వని తెలుసుకాని ఇంత ఫూల్‌వి అనుకోలేదు" కోపంగా అడిగాను.

ఫూల్ రాధిక నన్నింకా దగ్గరకి తీసుకుని నా చెవిలో చెప్పింది.

"అమ్మ లేని ఒక్క కారణంగా ఎన్ని బాధలు పడ్డానో నాకు తెలుసు. ధరణి కూతురికి, మరో పసిపిల్లకి ఆ బాధ కలక్కూడదని నాకు చేతనైన సహాయం చేసాను. అంతే. మిగిలినవి నేను ఆలోచించలేదు."

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments